


"వీకోసం ఎవరో వచ్చారు సార్!" అన్నాడు అటెండర్ రాజయ్య, రాంప్రసాద్ సీటు దగ్గ రికి వచ్చి.

"ఎవరూ?" అన్నాడు రాంప్రసాద్ విసుగ్గా.

"ఏమో!"


"ఎక్కడున్నాడు?"

"విజిటర్స్ రూములో"
అన్నాడు అటెండరు.

రాంప్రసాద్‌ను చూస్తూనే అతను లేచి నిల్చుని విష్ చేశాడు.

అతను ఎవరో రాంప్రసాద్‌కి తెలియదు. ఇంతకుముందు ఎప్పుడూ చూసిన గుర్తు కూడా లేదు.





మనిషి నీట్‌గా టక్ చేసుకొని వున్నాడు. ఎర్రగా, కాశ్మీర్ ఏపిల్ పండులా నిగ నిగ లాడుతున్నాడు. దూరంనుంచి చూస్తే ఆడపిల్లలా వుంటాడు.

"నా పేరు రమేష్‌ఖన్నా. శేఖర్ ఇంజనీరింగ్ కంపెనీ, సికింద్రాబాద్ నుండి వచ్చాను" అన్నాడు తనని తాను పరిచయంచేసుకుంటూ.

"గ్లాడ్ టూ మీట్ యూ!" అన్నాడు రాంప్రసాద్ షేక్ హాండ్ ఇస్తూ.

"మీతో పని వుంది" అన్నాడు ఖన్నా.

"చెప్పండి!"

"ఇక్కడ కాదు" అంటూ వాచీలో టైం చూసి, "టెన్ మినిట్సులో మీ ఆఫీసు టైం అయిపోతుంది కదా!" అన్నాడు.

"అవును."

"అంతవరకూ వెయిట్ చేస్తుంటాను. వెళ్ళి నా రూమ్‌లో మాట్లాడుకుందాం" అన్నాడు ఖన్నా.

రాంప్రసాద్ ఆశ్చర్యపోయాడు. 'ఆఫీసుకి వచ్చినవాడు పనేమిటో చెప్పకుండా, తనరూంకి

రమ్మంటా దేమిటి? అంత ముఖ్య మైన పని తన సీట్లో ఏమీ లేదే!'

"చెప్పండి—ఫర్వాలేదు" అన్నాడు రాంప్రసాద్.

"మరేంలేదు. మా కంపెనీ బిల్లు ఒకటి మీ ఆఫీసులో పెండింగు వుంది" అన్నాడు ఖన్నా స్వరం బాగా తగ్గించి.

"అలాగా! అయితే మా ఇ.ఇ. గారిని కలుసుకోండి. అసలు బిల్లు క్లర్కు రామనాథం నెలరోజులు సెలవు పెట్టాడు. నేను ఎడిషనల్ చార్జి తీసుకున్నాను. ఇంకా వారం కాలేదు. ఆ సీటు పాములపుట్టలా వుంది" అన్నాడు రాంప్రసాద్.

"రామనాథం సెలవు పెట్టాడని తెలిసే వచ్చాను. ఆ పని అతని వల్ల కాలేదు. కాని మీరు తప్పక చేయగలరు" అన్నాడు ఖన్నా.

ఇంతలో ఆఫీసు టైం కాస్తా అయిపోయింది.

రాంప్రసాద్ సీటు సర్ది బీరువాకి తాళం వేసి వచ్చాడు.

ఖన్నా కారుస్టార్టు చేసి రడీగా వున్నాడు. రాంప్రసాద్ ఎక్కి కూర్చోగానే విమానంలా రివ్వున గెస్టుహౌస్ పోర్టికోలో వెళ్ళి ఆగింది.

రూమ్ నెంబరు వన్‌లో ఖన్నా బస చేశాడు.

సోఫాలో కూర్చోగానే రాం ప్రసాద్ శరీరం తేలికై పోయి మబ్బుల్లో తేలినట్లనిపించింది.

చెమటలు కక్కుతున్న కూల్డ్ బీరు బాటిల్స్ తెచ్చి టిపాయ్ మీద పెట్టాడు బేరర్. చిప్సు, ఫ్రైడ్ చికెన్, క్యాజూ పకోడా ప్లేట్లలో సర్ది వెళ్ళి పోయాడు.

ఖన్నా బాటిల్ వంచి గ్లాసులోకి పోస్తుంటే, "ప్లీజ్! అసలు సంగతి చెప్పండి? మీపని నేను చెయ్యలేక పోతే ఇదంతా మీకు వేస్టు గదా?" అన్నాడు రాంప్రసాద్.

"యూపిల్లీ! మీరు చెయ్యలే రనే ప్రశ్నేలేదు. యూ విల్ డూ యిట్ డెఫినెట్లీ. హనుమంతుడికి తన సంగతి తనకు తెలియనట్లే మీ కెపాసిటీ మీకు తెలియదు" అన్నాడు ఖన్నా నవ్వుతూ.

'ఛీర్స్' చెప్పి గుటకలు వేశాడు. చల్లగా గొంతు దిగుతూంటే హాయిగా వుంది ప్రాణానికి 'ఈ బీర్ ఎవడు కనిపెట్టాడో కాని వాడికి నా జోహార్లు!' అనుకున్నాడు రాం ప్రసాద్.

"ఈ గెస్టుహౌస్ మీ ఆఫీసు కంట్రోల్లోనే వుంది" అన్నాడు ఖన్నా.

"అవును" అన్నాడు రాం ప్రసాద్.

"ఆ మధ్య ప్రైంమినిస్టర్ ఈ వూరు విజిట్ చేసినప్పుడు మా కంపెనీ ఎయిర్ కండిషనర్స్ సప్లై చేసింది" అంటూ పర్చేజ్ ఆర్డరు చూపించాడు ఖన్నా.

అవన్నీ చూసి-"చాలా కాలం అయిందే!" అన్నాడు రాంప్రసాద్.

"ఇంతడబ్బు పెండింగ్‌లో వుంటే టర్నోవర్ చెయ్యడం ఇబ్బందిగా వుంది."

"అవునూ! ఆ రామనాధంగాడు బిల్లు ఎందుకు పాస్ చెయ్యలేదు?" అన్నాడు రాంప్రసాద్.

"నో-నో. పాపం అతనికప్పు ఏం లేదు ఇందులో."

"మరి ఎవరు?" ప్రశ్నించాడు రాంప్రసాద్.

"మీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుతో పేచీ పడింది" అన్నాడుఖన్నా.

"ఏం?"

"ఆయన అడిగిన టర్మ్స్‌మాకు గిట్టుబాటు కాలేదు. అందువల్ల ఇవ్వలేక పోయాం. అది మనసులో పెట్టుకొని బిల్లు పాస్ చెయ్యవద్దని మేనేజర్‌కి చెప్పాడు. మేనేజర్ రామనాధాన్ని పిల్చి పెండింగ్ పెట్ట మన్నాడు."

"గవర్నమెంట్ ఆర్డర్సు ప్రకారమే పర్చేజ్ ఆర్డర్సు వేశారు గదా! ఎలా పెండింగ్ పెట్టారు?"

"ఇష్టం లేని మొగుడు పెరుగులో రాళ్ళొచ్చాయి అని పెళ్ళాన్ని చావబాదాడట. అలాగే మమ్మల్ని ఏడిపించాలంటే ఏదోక కారణం దొరుకుతూనే వుంటుంది" అన్నాడు ఖన్నా నవ్వుతూ.

"ఆయనకు ఇష్టం లేని బిల్లు నేను మాత్రం ఎలా పాస్ చేయగలను?" అనుమానంగా అన్నాడు రాం ప్రసాద్.

"ఎలా చేస్తారో నేను మీకు చెప్పాలా? అదంతా మీరు తల్చుకుంటే ఎంతలో పని?" అంటూనే రమేష్ ఖన్నా బ్యాగ్‌లో నుంచి సరికొత్త నోట్ల కట్ట ఎదురుగా పెట్టి "ప్లీజ్-టేకిట్!" అన్నాడు.

రాం ప్రసాద్ గుండె వంద మైళ్ళ స్పీడుతో కొట్టుకుంది—అంత డబ్బు చూసేసరికి. 'తన సీట్లోనూ ఆదాయం వస్తుంది. కానీ అంతా చిలక్కొట్టుడే. ఇంత డబ్బు రాదు. రామనాధం గాడు కొడుకుని 'యం. బి. బి. యస్.' చదివిస్తున్నాడంటే ఈ సీటు చలవేనన్న మాట! అయితే ఈ సీట్లో నుంచి కదలగూడదు. ఎలాగైనా కైవసం చేసుకోవాలి వాడు సెలవులోంచి వచ్చేలోగానే వాడికి వుద్వాసన చెప్పాలి'

"ఏమిటి ఆలోచిస్తున్నారు?" అన్నాడు ఖన్నా.

"ఏం లేదు. ఐ విల్ డూ ఇట్" అంటూ కరన్సీ కట్ట జేబులో వేసుకున్నాడు.

బేరర్ ఖాళీ బాటిల్స్ తీసుకెళ్ళి నిండువి తెచ్చాడు. బుసలుకొడుతూ గ్లాసుల్లోకి దూకుతుంది బీరు.

* * *

రాం ప్రసాద్ పాస్ చేసిన బిల్సు చూడగానే కల్లు త్రాగిన కోతిలా ఎగిరిపడ్డాడు మేనేజరు.

"కొంప ముంచావు గదయ్యా! ఈ శేఖర్ ఇంజనీరింగ్ కంపెనీ బిల్సు పాస్ చేసి పడేశావెందుకు? ఇ. ఇ. గారు మూల పడెయ్యమని చెప్పారు. అయితే ఛార్జి ఇచ్చేటప్పుడు ఆ రామనాధం చెప్పలేదా?" అన్నాడు.

"అన్నీ చెప్పాడు సార్!"

"మరి ఎందుకు పాస్ చేశావు? నీ సీట్లో పని నువ్వు చేసుకోక బిల్సు సీటుపని ఎవరు చెయ్యమన్నారయ్యా నిన్ను?" అన్నాడు మేనేజరు ఒకటే ఖంగారు పడిపోతూ.

"మీరు అనవసరంగా ఖంగారు పడకండి. బిల్సు వెంటనే పాస్ చెయ్యమని ఇ. ఇ. గారే స్వయంగా చెప్పారు. లేకపోతే నాకేం పట్టింది సార్! ఆ కంపెనీ వాడేమైనా స్నేహితుడా? లేకపోతే మేనమామా?" అన్నాడు రాంప్రసాద్.

"మరి ఆ మాట చెప్పవేం?" అంటూ సంతకాలు పెట్టేసి రాం ప్రసాద్ చేతికిచ్చాడు ఫైలు.

"ఏదీ-మీరు చెప్పనిస్తేనా?" అంటూ నవ్వాడు రాం ప్రసాద్.

'హమ్మయ్య! ఒక గండం గడిచింది' అనుకున్నాడు.

ఇ. ఇ. గారి రూములోకి వెళ్ళాంటే, "అయ్యగారు లేరు సార్!" అన్నాడు ఆటెండరు.

"తెలుసులే" అని లోపలికి వెళ్ళి ఇ.ఇ. ఇంటికి ఫోన్ చేశాడు.

"ఎవరూ?" అన్నాడు ఇ.ఇ. ఫోన్ ఎత్తి.

"నేన్సార్! రాం ప్రసాదుని. ఆఫీసునుండి మాట్లాడుతున్నాను."

"వాట్ మిస్టర్ ప్రసాద్? వాటిజ్ ద మేటర్?"

"ఎస్. ఇ. గారు పిలిపించారు సార్?"

"ఎవర్ని? నన్నా?"

"లేదుసార్. నన్నే."

"యస్. ఇ. గారు నిన్ను పిలిపించారా? ఎందుకు?"

"అదేసార్! రామనాధం-శేఖర్ ఇంజనీరింగ్ కంపెనీ బిల్లు పెండింగ్ పెట్టాడట. అతను లీవులో వున్నాడు గదండీ! ఆ సీటు నేను చూస్తున్నాను గదా! అందుకని నన్ను పిలిపించారు."

"వూఁ."

"అనవసరంగా నన్ను తిట్టారు సార్! నాకు తెలియదని మొత్తు

కున్నాను. ఆయన చాలా కోపంగా మాట్లాడారు సార్! మెటీరియల్ డెలివరీ తీసుకొని ఇన్నాళ్ళయినా బిల్ ఎందుకు పాస్ చెయ్యలేదని నాకు లెఫ్ట్‌రైట్ ఇచ్చారు సార్! ఆ కంపెనీ వాళ్ళు మినిస్టర్‌గారికి కంప్లైంట్ చేసినట్లున్నారు సార్!"

"ఓ మైగాడ్!" ఇ.ఇ. గారి కంఠం బొంగురుపోయింది.

"ఆ రామనాథాన్ని డిస్మిస్ చేస్తానని ఇంతెత్తు ఎగిరారు సార్ ఎస్. ఇ. గారు."

"నో...నో... నువ్వు ముందా బిల్లు ఎక్కడుందో వెదికి వెంటనే పాస్‌చేసి పర్సనల్‌గా పట్టుకురా! ఇంటి దగ్గరే ఉంటాను."

"ఎలా సార్? నా సీట్లోనే బోలెడు అర్జంటు కాగితాలున్నాయి సార్!"

"అవన్నీ తర్వాత చూసుకో వచ్చు లేవయ్యా! ముందు ఈ పని చూడు. వెరీ అర్జంట్! ఈ రోజు డిస్పాచ్ చేయించాలి మనం."

"సరే సార్!" అంటూ ఫోన్ పెట్టేసి నవ్వుకున్నాడు రాం ప్రసాద్.

* * *

మర్నాడు చెక్ తీసుకొని రాం ప్రసాద్‌కి థాంక్స్ చెప్పి కారులో తుర్రుమన్నాడు అన్నా.

పదిరోజులు గడిచాక ఎస్. ఇ. గారి ఆఫీసుకి పనిమీద వెళ్ళాడు ఇ.ఇ. గారు.

మాటల సందర్భంలో-"మీరు చెప్పినట్లు ఆ శేఖర్ ఇంజనీరింగ్ కంపెనీ వాళ్ళ బిల్లు పాస్ చేశాను సార్! చెక్ కూడా ఇచ్చేశాం" అన్నాడు ఇ.ఇ.గారు.

"నేను చెప్పానా?" అన్నాడు యస్.ఇ.గారు విస్తుపోతూ.

"అవున్సార్! తమరే!" అన్నాడు ఇ.ఇ.

"నో...నేనెవరికీ చెప్పలేదే!"

"అదేమిటి సార్? బిల్సు క్లర్కుకి స్వయంగా పిల్చి చెప్పారట గదా!"

"ఎవరన్నారు?"

"రాంప్రసాద్!"

"వాడెవడు?"

"మా ఆఫీసులో యు. డి. సి. సార్!"

"నేను మీ ఆఫీసులో యు.డి. సి.ని పిల్చి బిల్లు పాస్ చేయమని చెప్పానా? నాన్సెన్స్. అయినా నువ్వెట్లా నమ్మావు? ఏదైనా వుంటే నీకే చెప్పేవాడిని గదా?" అన్నాడు యస్.ఇ.గారు కోపంగా.

"అయితే మీరు చెప్పలేదన్న మాట! ఆ ప్రసాద్ గాడికి ఎంత ధైర్యం? కంపెనీ వారి దగ్గర

లంచం పుచ్చుకొని నన్ను పూల్‌ని చేసి బిల్లు పాస్ చేశాడన్నమాట!"

"వాడెవడో డేంజరస్ ఫెలోలా వున్నాడే. లెట్ మీ సీ హిమ్!" అన్నాడు యస్.ఇ.

"గుండెలు తీసిన బంటు" అన్నాడు ఇ.ఇ.

"వాడిని వదలగూడదు. వెంటనే వాడిని సస్పెండ్ చేసి పారెయ్!"

"యస్ సార్!"

రాంప్రసాద్ స్ప్రింగ్ డోర్ తెరుచుకొని లోపలికి ప్రవేశించి యస్.ఇ. గారికి, ఇ.ఇ. గారికి విష్ చేసి వినయంగా చేతులు కట్టు కున్నాడు.

ఇ.ఇ. గారికి అతన్ని చూడ గానే వంటిమీద దురదగుండాకు పూసుకున్నట్లు పిచ్చెక్కిపోయింది.

కాని యస్.ఇ. మాత్రం గాలి పోయిన రబ్బరు బెలూన్‌లా మెత్తబడిపోయాడు.

"నువ్వటోయ్ — మిస్టర్ ప్రసాద్! ఎవరో అనుకున్నాను" అన్నాడు యస్. ఇ. ఆవగారి పోతూ.

ప్రైమ్‌మినిస్టర్ వచ్చిన సంద ర్భంగా యస్. ఇ. గారు గెస్ట్ హౌస్‌లో పర్యవేక్షణలో వున్న ప్పుడు, రాంప్రసాద్ తనతో పరి చయం చేసుకొని మరుక్షణం లోనే స్టేట్ క్యాబినెట్ మినిస్టర్ని తనకి పరిచయం చేశాడు.

"రాంప్రసాద్ మా మేనల్లుడే" అన్నారు మినిస్టరుగారు.

యస్.ఇ. గారికి అదంతా జ్ఞాపకం వచ్చింది.

అప్పటివరకూ కారాలూ మిరి యాలూ నూరిన యస్.ఇ.గారు రాంప్రసాద్ చూడగానే ఎందుకు వూరుకున్నారో ఇ.ఇ. గారికి అర్థం కాలేదు!

"ఏమయ్యా! ప్రసాదూ! యస్.ఇ.గారు శేఖరం ఇంజ నీరింగ్ కంపెనీ బిల్లు పాస్ చెయ్య మన్నారా? ఇప్పుడు చెప్పు!" ఛాలెంజీ చేస్తూ అన్నాడు ఇ.ఇ. గారు.

రాంప్రసాద్ ఏ మాత్రం బంగారు పడకుండా "అవును సార్! ఆ రోజు పిలిపించి చెప్పారు. నిజమే! బహుశా మర్చిపోయి వుంటారు. వారికి ఎన్ని పనులూ, ఎన్ని యాపగేషన్సూ..." అన్నాడు.

యస్.ఇ.గారు తల వూపుతూ "యస్....యస్....మిస్టర్ రావ్! జ్ఞాపకం వచ్చింది. ఆ రోజు చెప్పాను" అన్నాడు.

"థాంక్స్ సార్!" అన్నాడు రాంప్రసాద్. ●